సాక్షి
కామారెడ్డి
మంగళవారం ౹ 11 ౹ జూలై ౹ 2023



అన్నిరంగాల్లో రాణించాలి

విద్యార్థులు చదువుతో పాటు అన్నిరంగాల్లో రాణించాలని జిల్లా విద్యాశాఖాధికారి రాజు పేర్కొన్నారు.

- 8లో ▸



ఫిర్యాదులను పరిష్కరించాలి

ప్రజావాణిలో నమోదైన ఫిర్యాదులకు తక్షణమే పరిష్కార మార్గం చూపాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ సూచించారు.

- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
32.4 /26.5

వాతావరణం

ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది. మధ్యాహ్నం మోస్తరు నుంచి భారీ వర్షం కురియవచ్చు.

న్యూస్‌రీల్

15న బీసీల రాజకీయ ప్లీనరీకి తరలిరావాలి

కామారెడ్డి అర్బన్/కామారెడ్డి టౌన్ : బీసీ జనాభా ప్రకారం చట్టసభల్లో వాటాను డిమాండ్ చేస్తూ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 15న హైదరాబాద్ ఎల్‌బీనగర్ కేబీఆర్ కన్వెన్షన్‌లో నిర్వహించే బీసీల రాజకీయ ప్లీనరీకి తరలిరావాలని సంఘం జిల్లా అధ్యక్షుడు సాప శివరాములు అన్నారు. సోమవారం కామారెడ్డి ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో బీసీల రాజకీయ ప్లీనరి వాల్ పోస్టర్లను విడుదల చేశారు. రాబోయే సాధారణ ఎన్నికల్లో బీసీల పాత్రపై ప్లీనరిలో ప్రధానంగా చర్చిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకులు లింబగిరి విఠల్, మోహనాచారి, నారాయణ రావు, మహేశ్‌కుమార్, కిషన్, సురేశ్‌కుమార్, రమేశ్ నర్సింలు పాల్గొన్నారు.

రేపు ఇంటర్‌లో ప్రవేశానికి స్పాట్ కౌన్సెలింగ్

భిక్కనూరు : సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఈనెల 12వ తేదీన ఇంటర్‌లో ప్రవేశానికి స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ నర్సింహారెడ్డి తెలిపారు. ఇంటర్ ఫస్టియర్ బైపీసీ, ఎంపీసీ విభాగంలో సీట్లు ఖాళీగా ఉన్నాయని 2023 పదో తరగతి ఫలితాల్లో 8.5 జీపీఏతో పాటు ఆపైన జీపీఏ సాధించిన విద్యార్థులు నేరుగా ఈనెల 12వ తేదీని ఒరిజినల్ టీసీ కుల ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో నేరుగా కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని ఆయన సూచించారు. వివరాలకు 63012 29385, 70325 86004లను సంప్రదించాలన్నారు.

విద్యాసంస్థల బంద్‌ను సక్సెస్ చేయాలి



మాచారెడ్డి : విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం లెఫ్ట్ స్టూడెంట్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఈనెల 12న జరుప తలపెట్టిన విద్యాసంస్థల బంద్‌ను సక్సెస్ చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్ కోరారు. ఈ మేరకు సోమవారం మాచారెడ్డిలో ఆయన మాట్లాడుతూ కళాశాలలు, పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. 12న అన్ని విద్యాసంస్థలు బంద్ పాటించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు సరిచంద్, నాయకులు ఈశ్వర్, ప్రశాంత్, అశ్రఫ్, బన్నీ, నరేష్, శ్రీరాం, పవన్, సంధ్య, సౌందర్య, అనూష, అఖిల, నిహారిక, జ్యోతి ఉన్నారు.

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలి



కామారెడ్డి టౌన్ : అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ, తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట పెద్దఎత్తున ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఐసీడీఎస్‌కు బడ్జెట్‌కు పెంచి బలోపేతం చేయాలన్నారు. ఐసీడీఎస్‌కు ప్రమాదకరంగా మారిన 2020 నూతన జాతీయ విద్యా విధానం చట్టాన్ని రద్దు చేయాలన్నారు. అంగన్‌వాడీ ఉద్యోగులకు కనీస వేతనం రూ. 26 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ కార్యాలయ ఏవోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లాలోని అంగన్‌వాడీలు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

లైసెన్స్ లేనోళ్లు లక్ష మంది!

- ఆర్టీఏలో డ్రైవింగ్ లైసెన్స్ తీసుకునేందుకు అవస్థలెన్నో..
- ఫైన్ల భయంతో దొడ్డిదారిన ప్రయాణం
- చిక్కినప్పుడల్లా జరిమానాలు కడుతూ బయటపడుతున్న వైనం..
- సిద్దిపేట జిల్లాలో ఎమ్మెల్యేలు, ఎంపీల చొరవతో యువతకు లైసెన్స్‌లు
- జిల్లాలోనూ ఇవ్వాలంటున్న యువత

జిల్లాలో వాహనాలు నడపడానికి కావాల్సిన డ్రైవింగ్ లైసెన్స్‌లు లేని వాహనదారులు పోలీసులు తనిఖీలు చేస్తున్న సమయంలో దొడ్డిదారుల గుండా వెళ్తున్నారు. ఒకవేళ పోలీసులకు చిక్కితే జరిమానా చెల్లిస్తున్నారు. ఇలా లైసెన్స్ లేకుండా జిల్లాలో లక్షమందికి పైగా వాహనాలపై తిరుగుతున్నారంటే ఆర్టీఏలో పరిస్థితి ఎలా ఉందో తెలుసుకోవచ్చు.



పోలీసులు రోడ్డుపై తనిఖీలు చేస్తుండడంతో కొంత దూరంలో ఆగిపోయిన వాహనదారులు (ఫైల్)



సాక్షి, కామారెడ్డి : వాహనం తీసుకుని రోడ్డు ఎక్కాలంటే వెంట డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు వాహనానికి సంబంధించిన పత్రాలన్నీ ఉండాలి. పత్రాలు లేకుండా వాహనం నడిపితే జరిమానాలు చెల్లించాల్సిందే. రవాణా శాఖ అధికారులతో పాటు పోలీసులు తనిఖీలు చేసినపుడు పత్రాలన్నీ చూపించాలి. లైసెన్స్‌తో పాటు వాహనానికి సంబంధించిన ఆర్సీ, ఇన్సూరెన్స్ ఇతర పత్రాలన్నీ సరిగా ఉంటేనే పంపిస్తారు. లేదంటే జరిమానాలు విధిస్తారు. కొన్ని సందర్భాల్లో వాహనాన్ని సీజ్ కూడా చేస్తారు. అయితే గత ఏడాది జిల్లాలో ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘనలకు సంబంధించి రూ. 10 కోట్ల మేర జరిమానాలు విధించారంటే అర్థం చేసుకోవచ్చు. కాగా రవాణా శాఖ రికార్డుల ప్రకారం జిల్లాలో అన్ని రకాల వాహనాలు 2,03,266 ఉన్నాయి. అయితే అన్ని రకాల లైసెన్స్‌లు కలిగి ఉన్న వారు 1,03,372 మంది మాత్రమే కావడం గమనార్హం. అంటే లక్ష మందికి డ్రైవింగ్ లైసెన్స్ లేదని స్పష్టమవుతోంది. రోజూ లక్ష మంది లైసెన్స్‌లు లేకుండానే తిరుగుతున్నారు.

పక్కదారిలో ప్రయాణం..

జిల్లాలో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నపుడు వాహనదారులు దొడ్డిదారి గుండా వెళ్తున్నారు. జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో పోలీసులు ప్రతిరోజూ ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం మూడు పూటలా తనిఖీలు చేపడుతున్నారు. పోలీసుల వాహనం రోడ్డు మీద కనిపిస్తే చాలు వాహనదారుల ఆగిపోతున్నారు. మరో దారి వెతుక్కుని వెళ్లిపోతున్నారు. ఒక్కోసారి పోలీసులకు చిక్కిన వారు కాళ్లావేళ్లా పడాల్సి వస్తోందని, వారికి చిక్కకుండా తిరగాల్సివస్తోందని పలువురు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏజెంట్ ఉంటేనే లైసెన్స్..

డ్రైవింగు లైసెన్స్‌ల జారీకి సంబంధించి ఉన్న నిబంధనలతో పాటు దళారీ వ్యవస్థ మూలంగా తమకు కావాల్సిన లైసెన్స్ పొందలేకపోతున్నారు. చదువుకోలేని వారి వద్ద సరైన ధ్రువపత్రాలు లేకపోవడంతో వారు లైసెన్స్‌లు పొందడానికి నానా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. చదువుకున్న వారు మీసేవ ద్వారా స్లాట్ బుక్ చేసుకుని వెళ్లినా అక్కడ పనులు జరగడం లేదు. ఏజెంట్ ద్వారా వెళ్తేనే రవాణా శాఖ కార్యాలయాల్లో పనులు జరుగుతున్నాయి. లేదంటే ఏదో ఒక కొర్రి పెట్టి పక్కన పడేస్తారు. అలా అని ఏజెంట్లను ఆశ్రయిస్తే అడ్డగోలుగా వసూలు చేస్తున్నారు. దీంతో లైసెన్స్ తీసుకోవడానికి చాలామంది వెనుకడుగు వేస్తున్నారు. రూ. వేలకు వేలు పెట్టేకన్నా, పోలీసులకు దొరకకుండా తిరగడమే ఉత్తమమని భావిస్తున్నారు.

జిల్లాలో వాహనాలు

ద్విచక్రవాహనాలు	1,50,436	నిర్మాణరంగ వాహనాలు	285	మ్యాక్సీ క్యాబ్	332
కార్	15,456	స్కూల్ బస్సులు	275	మోటార్ సైకిల్ ఫర్ హైర్	2
ఆటోరిక్షా	6,847	కంప్రెషర్	10	మోపెడ్స్	316
గూడ్స్ క్యారేజ్	5,729	కాంట్రాక్ట్ క్యారేజ్	36	ప్రైవేట్ సర్వీస్ వెహికిల్స్	10
ట్రాక్టర్ అగ్రికల్చర్	8,997	క్రేన్ మౌంటెడ్	1	రికవరీ వెహికల్	3
ట్రాక్టర్ కమర్షియల్	4,000	క్రేన్ ఫర్ ప్రైవేట్	4	రిగడ్ మౌంటెడ్	21
ట్రాక్టర్ ట్రాలీ అగ్రి	3,941	డంపర్	3	రోడ్ రోలర్	3
ట్రాక్టర్ ట్రాలీ కమర్షియల్	2,698	ఫోర్క్ లిఫ్ట్	7	స్టేజ్ క్యారియర్	186
త్రీ వీలర్స్ గూడ్స్	1,120	ఫైర్ టెండర్స్	2	సెల్ఫ్ లోడింగ్ కాంక్రీట్ మిక్సర్	12
మోటార్ క్యాబ్	1,268	అడాప్టెడ్ వెహికిల్స్	48	సెల్ఫ్ ప్రొపెల్డ్ హార్వెస్టర్	78
అంబులెన్స్	45	జీప్	18	మొత్తం	2,03,266
హార్వెస్టర్ (ట్రాక్టర్)	552	లోడర్	44		
ఓమ్ని బస్	449	లగ్జరీ టూరిస్ట్ క్యాబ్	32		

డ్రైవింగ్ లైసెన్స్‌లు ఉన్న వ్యక్తులు

మోటార్ సైకిల్, స్కూటర్, మోపెడ్స్	48,600
లైట్ మోటార్ వెహికిల్	37,043
ట్రాక్టర్లు	10,035
హెవీ మోటార్ వెహికిల్స్	752
ఇతర వాహనాలు	6,942
మొత్తం	1,03,372

ఎమ్మెల్యేలు చొరవ చూపితేనే..

మన జిల్లాకు పొరుగునే ఉన్న సిద్దిపేటలో అక్కడి ఎమ్మెల్యేలు, ఎంపీలు యువతకు డ్రైవింగు లైసెన్స్‌ల విషయంలో ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. లైసెన్స్ లేని వారి నుంచి వివరాలు తెప్పించుకుని ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయించి లైసెన్స్‌లు ఇప్పిస్తున్నారు. లైసెన్స్ కోసం అవసరమయ్యే చార్జీలు కూడా వారే భరిస్తున్నారు. దీంతో అక్కడ అందరూ లైసెన్స్‌లు పొందుతున్నారు. మన దగ్గర కూడా ఎంతో మంది లైసెన్స్‌లు లేక ఇబ్బందులు పడుతున్నారు. పోలీసులు తనిఖీలు చేస్తూ డ్రైవింగ్ లైసెన్స్ లేని వారి వాహనాలను సీజ్ చేయడం, ఫైన్లు వేయడం చేస్తున్న నేపథ్యంలో జిల్లాలోని ఆయా నియోజక వర్గాల్లో స్థానిక ఎమ్మెల్యేలు డ్రైవింగు లైసెన్స్‌ల విషయంలో చొరవ చూపాల్సిన అవసరం ఉంది. రవాణా శాఖ అధికారులతో ప్రత్యేక క్యాంప్‌లు ఏర్పాటు చేయించి లైసెన్స్‌లు ఇప్పించాలని పలువురు కోరుతున్నారు. జిల్లాలో లక్ష మందికి పైగా లైసెన్స్‌లు లేవు. 18 ఏళ్లు పైబడిన వారందరికీ లైసెన్స్‌లు ఇప్పిస్తే బాగుంటుందని వారంటున్నారు.

గాంధీభవన్‌కు కాంగ్రెస్ పంచాయితీ !



గాంధీ భవన్ వద్ద నిరసన తెలుపుతున్న కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ నేతలు

- మండల కమిటీలు ఏకపక్షంగా నియమించారని ఆరోపణ
- డీసీసీ అధ్యక్షుడిని మార్చాలంటూ డిమాండ్

సాక్షి, కామారెడ్డి : కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ అధ్యక్షుల నియామకం విషయంలో ఎల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీలో తలెత్తిన గ్రూప్ గొడవలు గాంధీ భవన్‌కు చేరాయి. పీసీసీ ఉపాధ్యక్షుడు మదన్‌మోహన్ వర్గీయులెవరికీ మండల కమిటీల్లో స్థానం లభించలేదు. దీనిపై మదన్ మోహన్ ఇప్పటికే రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి ఠాక్రేకు ఫిర్యాదు చేశారు. కాగా మదన్‌మోహన్ వర్గీయులు సోమవారం రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కార్యాలయమైన గాంధీ భవన్ కు తరలివెళ్లి అక్కడ బైఠాయించి నిరసన తెలిపారు. డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌ను టార్గెట్ చేస్తూ 'కాంగ్రెస్‌కు బచావో..డీసీసీ హఠావో' అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. పాత మండల కమిటీలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో ఏకపక్షంగా పీసీసీ ప్రధాన కార్యదర్శి సుభాష్‌రెడ్డి వర్గీయులకు మాత్రమే పదవులు ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండల కమిటీల నియామకం విషయంలో డీసీసీ అధ్యక్షుడి వైఖరిని ఎండగట్టారు. డీసీసీ అధ్యక్షుడిని మార్చాలని డిమాండ్ చేస్తున్నారు.

ఎల్లారెడ్డిలో రెండు గ్రూపులుగా నేతలు

కాంగ్రెస్ పార్టీకి గట్టి పట్టున్న ఎల్లారెడ్డి నియోజకవర్గంలో పార్టీ రెండుగా చీలింది. సుభాష్‌రెడ్డి, మదన్ మోహన్ వర్గాలుగా పార్టీ నేతలు, కార్యకర్తలు విడిపోయారు. పార్టీ కార్యక్రమాలన్నీ ఎల్లారెడ్డి నియోజకవర్గంలో వేర్వేరుగా చేస్తున్నారు. పీసీసీలో ఇద్దరికీ స్థానం దక్కింది. నియోజకవర్గంలో సేవా కార్యక్రమాలనూ పోటీపడి చేస్తున్నారు. నియోజకవర్గ కాంగ్రెస్‌లో నెలకొన్న గ్రూప్ గొడవలతో పార్టీ శ్రేణులు ఆందోళనకు గురవుతున్నాయి.

'గృహలక్ష్మి' పథకం నిరుపేదలకే..

- స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి
- నస్రుల్లాబాద్‌లో పర్యటన
- పలువురికి ఇళ్లు మంజూరు
- బోర్లంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవం



నస్రుల్లాబాద్‌లో సమీకృత భవనాన్ని పరిశీలిస్తున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి



బోర్లంలో పెద్దమ్మ తల్లి గుడికి శంకుస్థాపన చేస్తున్న స్పీకర్ పోచారం

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : గృహలక్ష్మి పథకం నిరుపేదలకు మాత్రమే అని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం నస్రుల్లాబాద్ మండల కేంద్రంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న సమీకృత భవనం పనులు ఆగస్టు 15వ తేదీలోగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. గ్రామంలో ఉన్న రెవెన్యూ భూమిని పరిశీలించారు. ఆ ప్రాంతంలో ఉన్న గుట్టను తొలగించి నిరుపేదలకు గృహలక్ష్మి పథకంలో రూ. 3 లక్షలు అందిస్తే ఇళ్లు నిర్మించుకుంటారన్నారు. వెంటనే గుట్టను తొలగించాలని ఆదేశించారు. అనంతరం గ్రామంలోని కొర్రి పోశవ్వ ఇంటికి వెళ్లి లోపలికి వెళ్లి ఇంటిని పరిశీలించారు. ఇరుకుగా ఉన్న ఇంటిని చూసి ఆమెకు కొత్త గృహలక్ష్మి పథకంలో భాగంగా ఇంటిని మంజూరు చేశారు. అనంతరం ఎస్సీ వాడలో మహిళలతో ముచ్చటించారు.

దేశానికి అన్నం పెట్టేది రైతన్నే..

బాన్సువాడ : దేశానికి అన్నం పెట్టే అన్నదాతకు అండగా రాష్ట్ర ప్రభుత్వం ఉందని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని బోర్లం గ్రామంలో పలు అభివృద్ధి పనులకు స్పీకర్ శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాంసాగర్ ప్రాజెక్ట్ పరిధిలోని ఆయకట్టు లో ఈ వానాకాలం రైతులు సాగు చేస్తున్న వరి పంటకు సాగునీరు ఇబ్బంది లేదని, ప్రస్తుతం సాగర్‌లో 5 టీఎంసీలకు తోడుగా అవసరమైన మరో 5 టీఎంసీలను సింగూరు లేదా కొండపోచమ్మసాగర్ జలాశయం నుంచి అందిస్తామని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారని అన్నారు.

బోర్లం గ్రామంలో సోమవారం పలు అభివృద్ధి పనులకు స్పీకర్ పోచారం శంకుస్థాపనలు చేశారు. రూ. 20 లక్షలతో పెద్దమ్మ తల్లి గుడి నిర్మాణం, రూ. 20 లక్షలతో సీతారామాలం, రూ. 15 లక్షలతో గంగ పుత్ర సంఘ భవనం, రూ. 15 లక్షలతో కుర్మ సంఘ భవన నిర్మాణాలకు స్పీకర్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నీరజావెంకట్ రాంరెడ్డి, జెట్పీటీసీ పద్మ, ఏఎంసీ చైర్మన్ నర్సింలు, సర్పంచ్ సరళ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ శ్రావణి, ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షులు బట్టు విఠల్, నాయకులు అంజిరెడ్డి, మోహన్‌నాయక్, శ్రీనివాస్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, నారాయణరెడ్డి తదితరులున్నారు.

ఎస్టీ గురుకులం పరిశీలన

నస్రుల్లాబాద్ మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరును ప్రిన్సిపాల్ వెంకట నారాయణకు అడిగారు. అనంతరం విద్యార్థులతో మా ట్లాడుతూ మెనూ అడిగి తెలుసుకున్నారు. సాయంకాలం ప్రేయర్‌లో పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పెర్క శ్రీనివాస్, వైస్ ఎంపీపీ ప్రభాకర్ రెడ్డి, జిల్లా కో ఆప్షన్ మెంబర్ మాజిద్ ఖాన్, నాయకులు ప్రతాప్ సింగ్,మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

నిధుల మళ్లింపు..

- రాష్ట్రంలోని 70 మార్కెట్ కమిటీల నుంచి ఒకే మార్కెట్‌కు రూ. 350 కోట్లు
- కోహెడ వద్ద నిర్మిస్తున్న అంతర్జాతీయ స్థాయి మార్కెట్‌కు రుణప్రాతిపదికన కేటాయింపు
- ఉమ్మడి జిల్లా నుంచి రూ. 32 కోట్లు
- వివిధ మార్కెట్లలో పెండింగ్‌లోనే అభివృద్ధి ప్రతిపాదనలు



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: హైదరాబాద్ నగర సమీపంలోని అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కోహెడ వద్ద నిర్మిస్తున్న అంతర్జాతీయ స్థాయి పండ్ల మార్కెట్‌కు రాష్ట్రంలోని 27 జిల్లాలకు చెందిన 70 వ్యవసాయ మార్కెట్ కమిటీల 'జమ నిధి' నుంచి 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను నిధులు మళ్లించారు. హైదరాబాద్ నగరంలోని గడ్డిఅన్నారం మార్కెట్‌ను కోహెడకు తరలించి ప్రపంచ స్థాయి మోడల్ మార్కెట్‌గా నిర్మిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం చెబుతోంది. ఇందుకు గాను మొదటి దశ పనులు చేపట్టేందుకు రుణ ప్రాతిపదికన ఈ నిధులు బదిలీ చేయడం గమనార్హం. నిధులను బదలాయించేందుకు ఎంపిక చేసిన సదరు 70 మార్కెట్లకు సంబంధించి మొత్తం రూ. 701 కోట్ల 12 లక్షల 87 వేలు ఉన్నాయి. ఈ నిధుల నుంచి రూ. 350కోట్లు తీసుకున్నారు.

మార్కెట్ కమిటీల నుంచి కేటాయించిన నిధులు

మార్కెట్	(రూ.కోట్లలో)	మార్కెట్	(రూ.కోట్లలో)
నిజామాబాద్	8	కమ్మర్‌పల్లి	4
బోధన్	3	మద్నూర్	3
ఆర్మూర్	2	జుక్కల్	4
వర్ని	3	ఎల్లారెడ్డి	5

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి..

ఇదిలా ఉండగా ఆయా మార్కెట్ల అభివృద్ధి పనులకు సంబంధించి ఇప్పటికే పెట్టుకున్న ప్రతిపాదనలు మాత్రం పెండింగ్‌లో ఉండడం విశేషం. నిజామాబాద్ మార్కెట్ కమిటీ యార్డులో రూ. 3.5కోట్లతో కవర్ షెడ్ నిర్మించేందుకు గాను పెట్టిన ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉన్నాయి. వీటికి అనుమతులు ఇప్పటివరకు రాలేదు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని 8 మార్కెట్ కమిటీల నుంచి కోహెడ మార్కెట్‌కు రూ. 32కోట్లు తీసుకున్నారు. ఇదిలా ఉండగా గతంలోనూ నిజామాబాద్ మార్కెట్ కమిటీ నుంచి మరో రూ. 7కోట్లు ఇతర జిల్లాల మార్కెట్లకు తరలించుకుపోవడం గమనార్హం. వనపర్తి మార్కెట్‌కు రూ. 4కోట్లు, గజ్వేల్ సమీపంలోని ఒంటిమామిడి మార్కెట్‌కు రూ. 3 కోట్లు తరలించుకుపోవడం గమనార్హం. కాగా ప్రస్తుతం కోహెడ మార్కెట్‌కు నిజామాబాద్ మార్కెట్ నుంచి రూ. 8కోట్లు బదలాయించారు. కాగా ఐదేళ్లుగా నిజామాబాద్ మార్కెట్ కమిటీకి చైర్మన్‌ను నియమించకపోవడం విశేషం.

ఉమ్మడి జిల్లాల్లోని మార్కెట్ల నుంచి కేటాయించిన నిధులు (రూ.లక్షల్లో)

జిల్లా	మార్కెట్ కమిటీల్లోని నిధులు	కోహెడకు కేటాయింపు
నిజామాబాద్	4681.52	2000.00
కామారెడ్డి	2380.17	1200.00

తెలంగాణ ఏర్పాటు తర్వాతే అభివృద్ధి

- ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్
- రూ. 3.83 కోట్లతో పనులు ప్రారంభం



అంబారిపేటలో నూతన జీపీ భవనానికి శంకుస్థాపన చేస్తున్న ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్

దోమకొండ: గ్రామాల్లో గతంలో ఎన్నడూ లేని విధంగా కేసీఆర్ హయాంలో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అభివృద్ధి పనులు జరిగాయని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అన్నారు. మండలంలోని అంబారిపేట గ్రామంలో సోమవారం రూ.3.83 కోట్లతో అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడారు. గతంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ, ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీలు కేవలం మాటలకే పరిమితమయ్యాయని విమర్శించారు. కుల మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని వివరించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రేమ్ కుమార్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ పున్న రాజేశ్వర్, జెడ్పీటీసీ సభ్యులు తీగల తిర్మల్‌గౌడ్, ఎంపీపీ కానుగంటి శారద, సీడీసీ చైర్మన్ ఐరేని నర్సయ్య, గ్రామ సర్పంచ్ ఎండీ సలీం, ఎంపీటీసీ సభ్యుడు ఫిరంగి రాజేశ్వర్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంద్ర మధుసూదన్‌రావ్, ఎంపీడీవో చిన్నారెడ్డి, తహసీల్దార్ కౌషిక్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

హాస్టళ్లను పరిశుభ్రంగా ఉంచాలి



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ క్యాంపస్‌లోని హాస్టళ్లతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచాలని రిజిస్ట్రార్ ఎం యాదగిరి ఆదేశించారు. సోమవారం క్యాంపస్‌లోని బాలుర (ఓల్డ్, న్యూ), బాలికల హాస్టళ్లను ఆయన తనిఖీ చేశారు. అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. విద్యార్థులు, సిబ్బందితో మాట్లాడి సమస్యలను తెలుసుకొని అక్కడికక్కడే పరిష్కార మార్గాలను సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, వంటగదుల్లో శుభ్రత పాటించాలని సూచించారు. హాస్టల్స్ చీఫ్ వార్డెన్ మహేందర్, అసిస్టెంట్ ఇంజినీర్ వినోద్‌కుమార్, ఎస్టేట్ ఆఫీసర్స్ అశోక్ వర్ధన్‌రెడ్డి, యాదగిరి, అసిస్టెంట్ వార్డెన్స్ కిరణ్ రాథోడ్, రాజేశ్వరి, కేర్‌టేకర్స్ క్రాంతి, దిగంబర్ చౌహాన్, రమేష్, పీరుబాయి ఉన్నారు.

నేటి నుంచి డిగ్రీ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ 2వ, 4వ, 6వ సెమిస్టర్ రెగ్యులర్,1వ,3వ,5వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్ష లు మంగళవారం (జూలై 11) నుంచి ప్రారంభమవుతాయని వర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి ఎం అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. సంబందిత డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లు,విద్యార్థులు ఈవిషయాన్నిగమనించాలనిసూచించారు.

రోడ్డు బాగు చేయాలని సర్పంచ్‌కు వినతి

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రం నుంచి జాతీయ రహదారి-161 వరకు గల ప్రధాన రహదారి గుంతలమయంగా మారి నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని వెంటనే రోడ్డుకు మరమ్మతులు చేయాలని గ్రామస్తులు సర్పంచ్ సురేష్, కార్యదర్శి సందీప్‌కు వినతి పత్రం అందించారు. సోమవారం జావీద్ అనే యువకుడు బైక్‌పై వెళ్తూ గుంతలను తప్పించబోయి కిందపడిపోయాడు. మద్నూర్ నుంచి నేషనల్ హైవే వరకు అడుగడుగునా గుంతలు పడ్డాయని వాటికి కనీసం ప్యాచ్ వర్క్ కూడా చేయడం లేదని ఆవేదన చెందుతున్నారు. వీధి దీపాలు కూడా లేకపోవడంతో చాలా ఇబ్బందిగా మారిందని అన్నారు.

గుండెపోటుతో తహసీల్దార్ మృతి



రమేష్ (ఫైల్)

సుభాష్‌నగర్: కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న తహసీల్దార్ ఎం రమేష్ (42) నగరంలోని కంఠేశ్వర్ బైపాస్ రోడ్‌లోగల తన నివాసంలో సోమవారం ఉదయం గుండెపోటుతో మృతిచెందారు. సిద్దిపేట సొంత జిల్లా అయినప్పటికీ రమేష్ ఇక్కడే స్థిరపడ్డారు. సౌమ్యుడు, వివాదరహితుడని రమేష్‌కు రెవెన్యూశాఖలో పేరుంది. గతంలో ఇందల్వాయి, పోతంగల్ తహసీల్దార్‌గా విధులు నిర్వర్తించారు. ఇందల్వాయిలో ఉన్నప్పుడు ఆయనపై ఏసీబీ అధికారులు దాడి చేశారు. ఆ సమయంలో రమేష్‌ను కలెక్టరేట్‌కు అటాచ్ చేశారు. అనంతరం నూతనంగా ఏర్పడిన పోతంగల్ మండలానికి తహసీల్దార్‌గా వెళ్లారు. అక్కడ విధుల్లో ఉన్నప్పుడే ఇందల్వాయి ఘటనలో సస్పెన్షన్‌కు గురయ్యారు. ఇటీవల కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా విధుల్లో చేరారు.

ఆస్పత్రి స్థలం కబ్జాపై ఫిర్యాదు

నవీపేట:మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి (సీహెచ్‌సీ) స్థలాన్ని కబ్జా చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బంది సోమవారం రెవెన్యూ, పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఖాళీగా ఉన్న ఆస్పత్రి స్థలాన్ని దర్జాగా కబ్జా చేసి రేకుల షెడ్డు వేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మెడికల్ ఆఫీసర్ స్రామాట్ యాదవ్, సూపర్‌వైజర్‌లు కిషన్, దేవేందర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

- రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్
- ప్రజావాణికి 53 వినతులు



ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రమోహన్

కామారెడ్డి క్రైం: ప్రజావాణి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ అధికారులకు సూచించారు. కామారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 53 ఫిర్యాదులు వచ్చాయి. శిక్షణ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, డీఆర్‌డీవో సాయన్న, ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలి

గతంలో జరిగిన గౌడ ఆత్మీయ సమ్మేళనంలో భాగంగా రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కల్లుగీత కార్మిక సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణిలో వినతిపత్రం అందించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట గౌడ్ మాట్లాడుతూ.. గౌడ కులస్తులకు ద్విచక్ర వాహనాలు, సేఫ్టీ మోకులు, రూ.లక్ష బీసీ రుణాలను వెంటనే అందజేయాలన్నారు.

లబాన్ లంబాడాలకు పోడు పట్టాలు ఇవ్వాలి

లబాన్ లంబాడాలకు పోడు పట్టాలు ఇవ్వాలని లబానా యువసేన ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. శతాబ్దాల క్రితమే తెలంగాణలోని ఆదిలాబాద్, కామారెడ్డి తదితర జిల్లాల్లో స్థిరపడి పోడు వ్యవసాయంపైనే ఆధారపడుతూ జీవనం సాగిస్తున్నామని తెలిపారు. ఎంతోమంది నిరుపేద కైతిలాబానాలకు ప్రభుత్వం పోడు పట్టాల పంపిణీలో అవకాశం ఇవ్వకపోవడం దురదృష్టకరమన్నారు.





మాట్లాడుతున్న కల్లుగీత కార్మిక సంఘం నాయకులు, లబానా యువసేన ప్రతినిధులు

కుల వృత్తిని కాపాడాలని..

తమ కుల వృత్తిని కాపాడాలని కోరుతూ నాయీ బ్రాహ్మణ జనశక్తి సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్‌కు తరలివచ్చారు. సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణపురం మహేందర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవీందర్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ స్వామిరాజ్ మాట్లాడుతూ.. నాయీ బ్రాహ్మణులందరూ కుల వృత్తి పైనే ఆధారపడి జీవిస్తున్నామన్నారు. ప్రస్తుతం చాలా చోట్ల కార్పొరేట్ సెలూన్లు ఏర్పాటు చేసి తమ పొట్ట కొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని తమ వృత్తిని తామే చేసుకునేలా ప్రభుత్వం జీవో మంజూరు చేయాలని కోరారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

డీఈవో రాజు



ప్రశంసా పత్రం అందజేస్తున్న డీఈవో రాజు

కామారెడ్డి టౌన్: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాలలో రాణించాలని డీఈవో ఎస్.రాజు సూచించారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఎస్‌సీఈఆర్‌టీ జనాభా విద్యా విభాగం, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో జిల్లా స్థాయి పోస్టర్ మేకింగ్ కాంపిటీషన్ ముగింపు సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. కళలు, సాంస్కృతిక, సాహిత్య రంగాలలో ప్రతిభను పెంపొందించుకోవాలని అన్నారు. ఉమ్మడి జిల్లాలో నిఖత్ జరీన్, మలావత్ పూర్ణను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. జిల్లా స్థాయి పోస్టర్ మేకింగ్ పోటీలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(తుజాల్‌పూర్)కు చెందిన శ్రీ చరణ్ ప్రథమ బహుమతిని, కేజీబీవీ రాజంపేట విద్యార్థిని ఎస్.శివాని ద్వితీయ బహుమతిని, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(దేవునిపల్లి) విద్యార్థి సాయి వర్షిత్ తృతీయ బహుమతిని గెలుచుకున్నారు. అకాడమిక్ మానిటరింగ్ అధికారి వేణుగోపాల్, స్థానిక ప్రధాన ఉపాధ్యాయులు గంగా కిషన్, తాడ్వాయి మండల నోడల్ అధికారి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

పాడి సంపదను పెంచుకోవాలి

- పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి సింహారావు



పశువులకు టీకాలను వేస్తున్న జేడీఏ

తాడ్వాయి(ఎల్లారెడ్డి): వ్యవసాయంతో పాటు పాడి సంపదను పెంచుకోవాలని పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి(జేడీఏ) సింహా రావు అన్నారు. ఎర్రాపహాడ్‌లో సోమవారం పశుగ్రాస ఉత్సవ కార్యక్రమంలో భాగంగా ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతుల కోసం అన్ని సదుపాయాలను కల్పిస్తోందని, రైతులు వ్యవసాయంతో పాటు పాడి పశువులను పెంచుకోవాలని సూచించారు. పశుగ్రాస ఆవశ్యకత, పశుగ్రాసం రకాలు, ప్రభుత్వం ఇస్తున్న గడ్డి విత్తనాల రకాల గురించి వివరించారు. సబ్సిడీపై మినరల్ మిక్చర్ సరఫరా చేయనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా పశువులకు గెండెవాపు, జబ్బువాపు నివారణ టీకాలను ఇవ్వడమే కాకుండా సాధారణ చికిత్సలు చేశారు. సర్పంచ్ నర్సారెడ్డి, ఎంపీటీసీ జలంధర్‌రెడ్డి, డీసీఎంఎస్ డైరెక్టర్ కపిల్‌రెడ్డి, పాలడైరీ డీడీ ప్రవీణ్ కుమార్, బీఎంసీ చైర్మన్ నరసింహారెడ్డి, మండల వైద్యాధికారి రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని వినతి



షబ్బీర్ అలీకి వినతిపత్రం అందిస్తున్న యువకులు

బీబీపేట: మండల కేంద్రంలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని, ఏర్పాటు విషయంలో ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని కోరుతూ మండల కాంగ్రెస్ నాయకులు, మాజీ మంత్రి షబ్బీర్ అలీకి వినతి పత్రం అందజేశారు. మండలంలో విద్యార్థుల సమస్యను వివరిస్తూ, బీబీపేటకు మంత్రులు వచ్చిన సందర్భంగా మాట ఇచ్చారని, మాట నిలుపుకునేలా ప్రయత్నం చేయాలని ఆయనను కోరారు. జూనియర్ కళాశాల ప్రారంభోత్సవానికి సైతం శ్రీమంతుడు సినిమా హీరో మహేష్ బాబు తీసుకువస్తానని అన్నారని వారు పేర్కొన్నారు. కళాశాల ఏర్పడితే చుట్టుపక్కల 15 గ్రామాల విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుందని వారు అన్నారు. ఈ సందర్భంగా పలువురు పార్టీలో చేరారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుతారి రమేష్, యువజన కాంగ్రెస్ నాయకులు చందు, పట్టణ అధ్యక్షుడు మహేష్, జనగామ సర్పంచ్ పాత రాజు, తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల సాధనే ముఖ్య ఉద్దేశం



బీబీపేట: మండల కేంద్రంలో జూనియర్ కళాశాల సాధనే లక్ష్యంగా ఉద్యమించాలని జూనియర్ కళాశాల సాధన సమితి సభ్యులు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో వివిధ సంఘాల నేతలు, పార్టీల సభ్యులు సమావేశమయ్యారు. మూడు సంవత్సరాల క్రితం బీబీపేట పర్యటనలో మంత్రులు కేటీఆర్, సబితా ఇంద్రారెడ్డి, ప్రశాంత్ రెడ్డి జూనియర్ కళాశాల ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని, ఇంత వరకు అమలుకు నోచుకోవడం లేదని అన్నారు. అంతే కాకుండా త్వరలోనే కోనాపూర్ గ్రామానికి కేటీఆర్ వస్తున్నందున కళాశాల కోసం ప్రకటన చేసి అమలు చేయాలని వారు కోరారు.

పుస్తకాలు, దుస్తులు పంపిణీ చేయాలి



కామారెడ్డి టౌన్: ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లలో చదివే విద్యార్థులకు తక్షణమే పుస్తకాలు, ఏకరూప దుస్తులను పంపిణీ చేయాలని బీసీ విద్యార్థి, తెలంగాణ జన సమితి ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ చంద్రమోహన్‌కు వినతిపత్రం అందజేశారు. పాఠశాలలు ప్రారంభమై నెల రోజులు దగ్గరపడుతున్నా ఇప్పటి వరకు పంపిణీ చేయకపోవడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు నీల నాగరాజు, టీజేఎస్ జిల్లా కన్వీనర్ కుంబాల లక్ష్మణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై ఏబీవీపీ పోరాటం





కామారెడ్డిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఏబీవీపీ నాయకులు, మాట్లాడుతున్న బీవీఎం నాయకులు

కామారెడ్డి టౌన్: ఏబీవీపీ ఆవిర్భావ, జాతీయ విద్యార్థి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏబీవీపీ ఆధ్వర్యంలో సోమవారం కామారెడ్డిలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. 75 ఏళ్లుగా విద్యారంగ సమస్యలపై ఎనలేని పోరాటాలు ఏబీవీపీ చేసిందని రాష్ట్ర సహాయ కార్యదర్శి మనోజ్ అన్నారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ కృష్ణ, పట్టణ కార్యదర్శి చరణ్, నాయకులు రోహిత్, ఖలీల్, రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

బంద్‌ను విజయవంతం చేయాలి

కామారెడ్డి టౌన్: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 12న నిర్వహించనున్న రాష్ట్ర వ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని భారతీయ విద్యార్థి మోర్చా రాష్ట్ర కార్యదర్శి జీవీఎం విఠల్ పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలో వారు మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, ఖాళీలుగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యశ్వంత్, పెరుమాండ్ల బుల్లెట్, ఉపాధ్యక్షులు అర్బాస్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

బతుకు చిత్రం



తీగపై ఒంటికాలిపై నిల్చొని విన్యాసం చేస్తున్న యువతి

బీబీపేట: పొట్ట కూటి కోసం ప్రాణాన్ని సైతం లెక్కచేయకుండా ఓ యువతి విన్యాసాలు చేసింది. బీబీపేటలో ఆదివారం రాత్రి కొందరు సర్కస్ ఫీట్లు వేశారు. యువతి సాహోసేపత విన్యాసాలతో ఆకట్టుకుంది. తీగపై ఒంటి కాలితో నడిచి ఆశ్చర్యపరిచింది.

పబ్బు తగలబెడుతుండగా ఫిట్స్

- మంటల్లో పడి యువకుడికి తీవ్రగాయాలు

మాచారెడ్డి: ఇంటి ముందు వేసిన పందిరి పబ్బు(కొమ్మలు, ఆకులు) తగల బెడుతుండగా.. ఫిట్స్ వచ్చి మంటల్లో పడి ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన సోమవారం పాల్వంచలో జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన తోట నరేష్ కుటుంబ సభ్యులు ఇటీవల నూతన గృహ ప్రవేశం చేశారు. ఇంటి ముందు వేసిన పందిరి పబ్బు తగుల బెడుతుండగా నరేష్‌కు ఫిట్స్ వచ్చి ఆ మంటల్లో పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన ఆయనను కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు.

క్రైం కార్నర్

వేర్వేరు ప్రమాదాల్లో పలువురి మృతి



దత్తాత్రి మృతదేహం

కామారెడ్డి క్రైం: లిఫ్ట్ గుంతలో పడి ఒకరు మృతి చెందిన ఘటన జిల్లా కేంద్రంలోని దర్శన్ థియేటర్ పక్కన నిర్మాణంలో ఉన్న ఓ భవనం వద్ద సోమవారం వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లిలో నివాసం ఉండే లింగంపల్లి దత్తాత్రి (39) మేస్త్రి పని చేసేవాడు. అతనికి భార్య లలిత కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. దర్శన్ టాకీస్ పక్కన ఓ భవన నిర్మాణం జరుగుతుంది. అందులో లిఫ్టు ఏర్పాటు చేయాల్సిన స్థలంలో గుంత తీసి ఉంది. సోమవారం ఉదయం ఒక వ్యక్తి లిఫ్ట్ గుంతలో పడి మృతి చెంది ఉన్నట్లు స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పట్టణ ఎస్‌హెచ్‌ఓ నరేష్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ జరిపారు. మృతుడిని దేవునిపల్లికి చెందిన దత్తాత్రిగా గుర్తించారు. మద్యం మత్తులో గుంతలో పడి బలమైన గాయాలు తగలడంతో మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పాటు కాటుతో రైతు..

భిక్కనూరు: మండలంలోని అంతంపల్లి గ్రామానికి చెందిన ఒక రైతు పాటుకాటుతో మృతి చెందినట్లు ఎస్సై గాంధీగౌడ్ సోమవారం తెలిపారు. గ్రామానికి చెందిన నారిగల్ల శంకర్(59) ఆదివారం సాయంత్రం తన వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి అక్కడ పనులు చేసుకుని రాత్రి ఇంటికి వచ్చాడు. తనకు ఆగం ఆగం అవుతుందని ఇంట్లో భార్య లలితకు చెప్పి నురుగులు కక్కుతూ కింద పడిపోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. లలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై చెప్పారు. మృతుడికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

రామారెడ్డి: రామారెడ్డి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అప్పుల బాధ, అనారోగ్య కారణాలతో ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై అనిల్ తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన పురిమిశెట్టి లక్ష్మీనారాయణ (57) వ్యవసాయం చేస్తూ జీవనం సాగించేవాడు. కొన్ని రోజుల ఆయన ఎడమ కాలుకు దెబ్బ తగిలింది. ఏడాది క్రితం ఆయన కొత్తగా ఇల్లు నిర్మించాడు. ఇంటికి చేసిన అప్పులు ఎక్కువ కావడం, పనులు చేసుకోవడానికి కాలు సహకరించకపోవడంతో ఆదివారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య అంజవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పేకాడుతున్న నలుగురిపై కేసు

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి శివారులోని జీవదాన్ పాఠశాల వెనకాల గల అటవీ ప్రాంతంలో పేకాడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై గణేశ్ సోమవారం తెలిపారు. వారి నుంచి రూ.1700 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

ఎడపల్లిలో చోరీ

ఎడపల్లి: ఎడపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో సోమవారం తెల్లవారుజామున చోరీ జరిగినట్లు సర్పంచ్ ఆకుల మాధవి శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కార్యాలయంలో మూడు బీరువాలను పగులగొట్టి పరికరాలు, సామగ్రి రూ.10 వేల విలువైన వస్తువులు ఎత్తుకెళ్లినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే ఎడపల్లి గ్రామానికి చెందిన కళా రాజు అనే వ్యక్తి ఇంట్లో సైతం చోరీ జరిగింది. రెండున్నర తులాల బంగారం ఎత్తుకెళ్లినట్లు కళా రాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రెండు కేజ్‌వీల్ ట్రాక్టర్ల సీజ్

వేల్పూర్: మండలంలోని వెంకటాపూర్, కొత్తపల్లి గ్రామాలకు చెందిన రెండు కేజ్‌వీల్ ట్రాక్టర్లను సోమవారం సీజ్ చేసినట్లు ఎస్సై వినయ్‌కుమార్ తెలిపారు. కేజ్‌వీల్ ట్రాక్టర్లను తారురోడ్లపై నడపడం చట్టరీత్యా నేరమని, అలా నడిపితే సీజ్ చేస్తామని హెచ్చరించారు.

యువకుల కిడ్నాప్ కలకలం

- రెండు రోజుల పాటు ఫామ్‌హౌస్‌లో బంధించిన వైనం
- బంధువులకు తెలియడంతో విడుదల



మీడియాతో మాట్లాడుతున్న జావెద్, సుమేర్

కామారెడ్డి క్రైం: ట్రేడింగ్ వ్యాపారం పేరుతో డబ్బులు వసూలు చేసి ఉడాయించిన ఓ యువకుడి అడ్రస్ కోసం అతడి ఇద్దరు స్నేహితులను కిడ్నాప్ చేసి ఓ ఫామ్ హౌస్‌లో బంధించిన ఘటన కామారెడ్డిలో సోమవారం వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి.. జిల్లా కేంద్రానికి చెందిన లుక్మాన్ అనే యువకుడు ట్రేడింగ్ బిజినెస్ చేసేవాడు. తన ట్రేడింగ్ వ్యాపారంలో దాదాపు 20 నుంచి 30 మంది ద్వారా రూ.కోటిన్నర వరకు పెట్టుబడులు పెట్టించాడు. కొద్ది రోజుల తర్వాత డబ్బుతో పరారయ్యాడు. అప్పటి నుంచి తమ డబ్బులు రాబట్టుకునేందుకు బాధితులు చాలా చోట్ల గాలించడం మొదలుపెట్టారు. కామారెడ్డిలోని సైలానీబాబా కాలనీకి చెందిన సయ్యద్ జావేద్, ఇస్లాంపుర కాలనీకి చెందిన సుమేర్ హైద్రాబాద్ రామంతపూర్‌లో నివాసం ఉంటూ బుల్లెట్ షోరూంలో సేల్స్ ఎక్జిక్యూటివ్‌లుగా పని చేస్తున్నారు. లుక్మాన్ వారి గదిలో ఉంటూ కామారెడ్డికి వచ్చి వెళ్లేవాడు. అక్కడ నుంచే వ్యాపార వ్యవహారాలు చూసుకునేవాడు. పది రోజుల క్రితం నుంచి లుక్మాన్ కనిపించక పోవడంతో అతని తండ్రి మజార్ హైదరాబాదు వెళ్లి ఉప్పల్ పోలీస్ స్టేషన్‌లో అతని ఆచూకీ కోసం ఫిర్యాదు చేశాడు. దీంతో అక్కడి పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేశారు. ఆ కేసు విచారణలో ఉంది. లుక్మాన్ నాలుగు రోజుల క్రితం జావేద్, సుమేర్‌కు ఫోన్ చేసి ట్రేడింగ్ వ్యాపారంలో నష్టాలు రావడంతో తాను ముంబైలో తలదాచుకుంటున్నానని చెప్పాడు. అదే విషయాన్ని జావెద్, సుమేర్ లుక్మాన్ తండ్రితో పాటు ఉప్పల్ పోలీసులకు చెప్పారు. జావేద్, సుమేర్‌తో లుక్మాన్ ఫోన్‌లో మాట్లాడినట్లు ఉప్పల్ పోలీసుల ద్వారా కామారెడ్డికి చెందిన పలువురు డబ్బులు రావాల్సిన వారు తెలుసుకున్నారు. శుక్రవారం ముగ్గురు వ్యక్తులు రామంతపూర్ షోరూంకు వెళ్లారు. జావేద్, సుమేర్‌ను కారులో తీసుకువచ్చి కామారెడ్డికి సమీపంలోని పొందుర్తి వద్ద ఉన్న ఓ ఫామ్ హౌస్‌లో బంధించారు. లుక్మాన్ అడ్రస్ చెప్పాలని, డబ్బులు తిరిగి వచ్చేదాకా ఊరుకోబోమని బెదిరిస్తూ రెండ్రోజుల పాటు చిత్రహింసలకు గురి చేసినట్లు బాధితులు చెబుతున్నారు. యువకులను ఫామ్‌హౌస్‌లో బంధించినట్లు కామారెడ్డిలోని వారి బంధువులకు తెలియడంతో ఆదివారం రాత్రి వారిని విడిచిపెట్టారు. సోమవారం బాధితులు పట్టణ పట్టణ పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. కిడ్నాప్ కేసు నమోదు చేయాలని ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌హెచ్‌వో నరేష్ తెలిపారు.

డ్రంకన్ డ్రైవ్ కేసులో రెండు రోజుల జైలు

కామారెడ్డి క్రైం: మద్యం తాగి వాహనం నడిపిన కేసులో కామారెడ్డి కోర్టు ఒకరికి రెండు రోజుల జైలు శిక్ష విధించింది. రెండు రోజుల క్రితం దేవునిపల్లి పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా సరంపల్లికి చెందిన మామిండ్ల స్వామి డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డాడు. అతడిని సోమవారం కోర్టులో హాజరుపర్చారు. నిందితునికి ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి ప్రతాప్ రెండు రోజుల జైలు శిక్ష, రూ.200 జరిమానా విధించినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

భిక్కనూరు: మండలంలోని పెద్దమల్లారెడ్డికి చెందిన బొజ్జ దివ్య సోమవారం ఆత్మహత్యకు యత్నించింది. గ్రామానికి చెందిన దివ్యకు భర్త, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సోమవారం ఆమె ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించాలని వైద్యులు సూచించారు. దీంతో ఆమెను గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ విషయమై ఎస్సై ఆనంద్‌గౌడ్‌ను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

మెట్లపై నుంచి జారి పడి ఒకరు..

కామారెడ్డి క్రైం: నిద్ర మత్తులో మెట్లపై నుంచి జారి పడి ఒకరు మృతి చెందారు. ఎల్లారెడ్డి మండలం బొల్లారం గ్రామానికి చెందిన బాల కిష్టయ్య (26) కూలీ పనులు చేసుకుంటూ కొద్దిరోజులుగా కామారెడ్డిలోని అశోక్‌నగర్ కాలనీలో భార్యతో కలిసి నివాసం ఉంటున్నాడు. రోజూ మాదిరిగానే ఆదివారం రాత్రి పడుకున్నారు. అర్ధరాత్రి లేచి వెలుగుతున్న లైట్లు ఆఫ్ చేయబోయాడు. నిద్రమత్తులో మెట్లపై జారి పడి తలకు తీవ్ర గాయాలు కాగా అతడిని ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆదివారం మెరుగైన వైద్యం కోసం హైద్రాబాద్‌కు తీసుకువెళ్తుండగా చనిపోయాడు. అతని తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో నరేష్ తెలిపారు.

సీజ్ చేసిన ఇసుకకు వేలం

సిరికొండ: మండలంలోని మైలారం గ్రామ శివారులో నిర్మాణంలో ఉన్న ఫంక్షన్ హాల్ వద్ద సీజ్ చేసిన ఇసుకకు సోమవారం వేలం పాట నిర్వహించినట్లు తహసీల్దార్ గఫార్‌మియా తెలిపారు. సుమారు పది ట్రాక్టర్ల ఇసుకకు వేలం పాట నిర్వహించగా ఇద్దరు వ్యక్తులు పాల్గొన్నారని తెలిపారు. రావుట్ల గంగాధర్ అనే వ్యక్తి అధికంగా వేలం పాడగా రూ. 15 వేలకు అతనికి ఇసుకను కేటాయించినట్లు చెప్పారు. వేలం పాట డబ్బులను తహసీల్దార్ వాల్టా ఖాతాలో జమ చేశామన్నారు.